క్లుప్తంగా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాపై శిక్షణనిస్తున్న నసీమున్నీసా

మిరుదొడ్డి(దుబ్బాక): యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్య పడుతుందని యునానీ వైద్యురాలు డా.నసీమున్నీసా అన్నారు. స్థానిక యునానీ యోగా కేంద్రంలో మంగళవారం ఆమె మహిళలకు యోగాసనాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయుష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం వచ్చే నెల 21 వరకు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ సమీనా సుల్తానా, ఫార్మాసిస్టు నరేశ్‌కుమార్, డీపీఎం భానుతేజ, యోగా శిక్షకులు వి.స్వప్న, ప్రవీణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అందని మెడికల్ బిల్లులు



డీఈఓ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న డీటీఎఫ్ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉపాధ్యాయులకు అందాల్సిన మెడికల్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరగా చెల్లించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కిష్టయ్య, ప్రధాన కార్యదర్శి తిరుపతి కోరారు. నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం డీఈఓ, జెడ్పీ సీఈఓ, డీటీఓలను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో చంద్రబాను, రాములు, మల్లయ్య, మనీష్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, రాజిరెడ్డి, వెంకటరమణారెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన అవసరం



అంగీకార పత్రాన్ని అందజేస్తున్న సాయికృష్ణ

హుస్నాబాద్: ప్రతి ఒక్కరు అవయవ దానంపై అవగాహన పెంచుకోవాలని తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల సంఘం జిల్లా అధ్యక్షుడు బూట్ల రాజమల్లయ్య సూచించారు. పట్టణానికి చెందిన గట్టు సాయికృష్ణ మరణాంతరం తన శరీరాన్ని కాకతీయ మెడికల్ కళాశాలకు దానం చేస్తున్నట్టు అంగీకార పత్రాన్ని మంగళవారం రాజమల్లయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా రాజమల్లయ్య మాట్లాడుతూ ప్రతియేటా ఎంతో మంది విద్యార్థులు పార్థివ దేహాల కొరతతో తమ పరిశోధన కొనసాగించలేక పోతున్నారన్నారు.

ఆయిల్‌పామ్‌తో లాభాలు



మాట్లాడుతున్న ఉద్యాన అధికారి బాలాజీ

బెజ్జంకి(సిద్దిపేట): ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని హుస్నాబాద్ డివిజన్ ఉద్యానశాఖ అధికారి బాలాజీ సూచించారు. రైతు వేదికలో మంగళవారం ఆయిల్ పామ్ తోటల సాగుపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభు త్వం ఆయిల్‌పామ్ సాగుకు రాయితీలు ఇస్తుందన్నారు. ఎకరాకు సుమారు రూ.1.50 లక్షల వరకు ఆదాయం పొందవచ్చని తెలిపారు. సమావేశంలో ఏఓ సంతోష్, ఆయిల్‌ఫెడ్ అధికారి రాము, ఎఫ్ఓ యేసుమణి, ఏఈఓలు పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తం: ఏసీపీ



ఏసీపీకి పూలమొక్కను అందజేస్తున్న సీఐ సైదా

గజ్వేల్‌రూరల్: విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ నర్సింహులు సూచించారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని కోరారు. స్టేషన్ పరిసరాలు, సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. కార్యక్రమంలో గజ్వేల్ సీఐ సైదా, అదనపు సీఐ ముత్యంరాజు, ఎస్‌ఐ యాదవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

దినదిన గండం.. భయం భయం

- శిథిలావస్థలో ఎంపీడీఓ కార్యాలయం
- విధులు నిర్వహించాలంటే హడల్
- వర్షాలకు ఊడిపడుతున్న పెచ్చులు
- ఎప్పుడు కూలిపోతుందో తెలియని దుస్థితి
- నిర్మాణానికి మోక్షం ఎప్పుడో?



పాఠశాలలో కొనసాగుతున్న ఎంపీడీఓ కార్యాలయం

ఏ క్షణాన ఊడిపడుతుందో తెలియని పైకప్పు, వర్షపునీటితో నాచు పట్టిన గోడలు, శిథిలావస్థకు చేరిన పాడుపడ్డ భవనం. ఇదీ అక్కన్నపేట ఎంపీడీఓ కార్యాలయం దుస్థితి. భవనం ఎప్పుడు కూలిపోతుందోననే భయంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంగా అక్కన్నపేట 2016లో ఏర్పాటైంది. అప్పటి నుంచి నేటి వరకు ఎంపీడీఓ కార్యాలయానికి సొంత భవనం లేదు. అప్పటి ప్రభుత్వం ఆదేశాల మేరకు అధికారులు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థలకు చేరిన నాలుగు తరగతి గదులకు మరమ్మతులు చేయించి అందులో ఏర్పాటు చేశారు.

కార్యాలయం కారుతోంది

ఈ మండల ప్రజాపరిషత్ కార్యాలయం పరిధిలో 37 గ్రామాలు ఉన్నాయి. దాదాపు 60కిపైగా గిరిజన తండా, పల్లెలు ఉన్నాయి. దాదాపుగా 35 వేలకు పైగా జనాభా ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కార్యాలయంలో పెచ్చులు ఊడి పడుతున్నాయి. అలాగే కార్యాలయ గోడలకు నాచు, పదను పట్టి ఉంది. భారీ వర్షాలు కురిస్తే కార్యాలయం అంతా కారుతోందని అధికారులు చెబుతున్నారు.

నిర్మాణానికి మోక్షం కలిగేనా?

తొమ్మిదేళ్లుగా కార్యాలయంలో సరైన సౌకర్యాలు లేకపోయినా ఉద్యోగులు ఎలాగో నెట్టుకొస్తున్నారు. ఏదైనా సమీక్ష సమావేశం నిర్వహించాలన్నా గదులు లేవు. ఇటీవల చిన్నపాటి వర్షానికే కార్యాలయంలో గోడలకు పదను, నాచు పట్టింది. రానున్న వర్షకాలంలో కార్యాలయం పరిస్థితి ఎలా ఉంటుందో అంటూ అధికారులు వాపోతున్నారు. అయితే భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.50 కోట్లు మంజూరు చేసినా నిర్మాణ పనులకు ముందడుగు పడలేదు.



నాచుపట్టి, నీరుకారుతున్న గోడ

భద్ర పరిచేదెలా?



బీటలువారి పెచ్చులు ఊడుతున్న స్లాబు

వర్షాలు కురిసినప్పుడు నీరు కారడంతో గదుల్లో భద్రపరిచే ముఖ్యమైన ఫైల్స్ తడిపోతున్నాయని అధికారులు వాపోతున్నారు. ప్రజాపాలన, రాజీవ్ యువ వికాసంతోపాటు తదితర దరఖాస్తులు భద్రపరచడానికి సరైన గదులు లేక అవస్థలు పడుతున్నారు. ఈ విషయంపై ఇటీవల ఎంపీడీఓ భానోతు జయరాం అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు వివరించారు. దానికి ఆమె సానుకూలంగా స్పందించారని, మరమ్మతులకు నిధులు మంజూరు చేయడానికి ప్రతిపాదనలు పంపించాలని సూచించినట్టు ఎంపీడీఓ చెప్పారు.

నిధులు మంజూరయ్యాయి కానీ..



ఎంపీడీఓ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. భవన నిర్మాణ మ్యాపు, గదుల కొలత తదితర వివరాలతో ప్రతిపాదనలు తయారు చేసి పంపినాం. ప్రస్తుతం పంచాయతీరాజ్ ఎస్‌ఈ కార్యాలయంలో ఉంది. ఇంకా టెండర్ కాలేదు. టెండర్ కాగానే పనులు ప్రారంభిస్తాం.

- మహేశ్, పంచాయతీరాజ్ డీఈ

‘కల్యాణ లక్ష్మి’ని ప్రారంభించింది కేసీఆరే..

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్)/చేర్యాల(సిద్దిపేట): కల్యాణలక్ష్మి పథకాన్ని కేసీఆరే మొదలు పెట్టారని, ఈ ప్రభుత్వం కొనసాగిస్తోందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్లలో దాదాపుగా 12 లక్షల మందికి చెక్కులను అందజేశామన్నారు. మండలంలో రోడ్లు వేయాలని మంత్రి సీతక్కను కోరానని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, కల్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తరిగొప్పుల నుంచి గండిరామారం ద్వారా పైపులైను ద్వారా దూల్మిట్ట మండలంలోని కూటిగల్ చెరువును నింపే ప్రయత్నం చేస్తున్నమని చెప్పారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు వచ్చేలా చర్యలు చేపడుతన్నామని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, తహసీల్దార్ రహీం, ఎంపీడీఓ రామ్మోహన్, నాయకులు సంతోష్‌కుమార్, యాదగిరి, సుమలత, సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

డ్రగ్స్ నిర్మూలన అందరి బాధ్యత



మత్తు పదార్థాలను దూరం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

నియోజకవర్గ జేఏసీ చైర్మన్ లక్ష్మారెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): సమాజాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్‌ను నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని నియోజకవర్గ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని జనగామ, అంతక్కపేట, కట్కూర్, కన్నారం గ్రామాల్లో మంగళవారం డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్రపై మహిళలకు అవగాహన కల్పించారు. అలాగే రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ సతీమణి రమాబాయి అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు పార్టీలకతీతంగా డ్రగ్స్‌పై పోరాడాలని, అప్పుడే యువతను కాపాడుకోగలమని చెప్పారు. కార్యక్రమంలో జేఏసీ కో- ఆర్డినేటర్ వీరన్నయాదవ్, కో-కన్వీనర్ సారయ్య, నాయకులు ప్రకాశ్, శ్రీదేవి, జగదీశ్, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, సీసీలు తిరుపతి, రాజు, పంచాయతీ కార్యదర్శి సంజీవ్, మహిళలు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక ఆదాయం

శాస్త్రవేత్తల సూచనలు

ములుగు(గజ్వేల్): పంట మార్పిడితో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని శాస్త్రవేత్తలు సూచించారు. బండ నర్సంపల్లి, జప్తిసింగాయిపల్లి, బండతిమ్మాపూర్ గ్రామాలలో మంగళవారం నిర్వహించిన ‘రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు’ కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్తలు వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రశాంత, వాణిశ్రీ, మధుబాబు, పల్లవి, లతీఫ్, పాషా పాల్గొని మాట్లాడారు. రసాయనిక ఎరువులు, పురుగుల మందుల వాడకాన్ని తగ్గిస్తే రైతులకు ఎంతో లాభదాయకమని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు పృథ్వి, అనుజ్ఞ, నివేదిత, పీహెచ్‌డీ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రశీదులు భద్రపరచుకోవాలి

వర్గల్(గజ్వేల్): ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రశీదులను భద్రపరచడం ద్వారా పంటనష్టం జరిగినప్పుడు రైతులు పరిహారం పొందే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్.వి జయకుమారి, డాక్టర్ డి.శివాని సూచించారు. మండలంలోని సింగాయపల్లిలో వారు రైతులకు అవగాహన కల్పించారు. అవసరం మేరకే రసాయన ఎరువులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో విస్తరణాధికారి సంతోష్, రైతులు పాల్గొన్నారు.



ములుగు(గజ్వేల్): నర్సంపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రెడ్డి

నకిలీ విత్తనాల విక్రయాలపై నజర్

ఎస్‌ఐ అభిలాష్

కోహెడ(హుస్నాబాద్): నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని ఎస్‌ఐ అభిలాష్ చెప్పారు. స్థానిక అశ్విని సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాక్ రికార్డులు పరిశీలించారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ సతీశ్, ఏఈఓలు శ్రీధర్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలే విక్రయించాలి

హుస్నాబాద్‌రూరల్: రైతులకు నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని ఏడీఏ శ్రీనివాస్ విత్తన విక్రయ డీలర్లకు సూచించారు. రైతువేదికలో విత్తన, ఎరువుల దుకాణాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాస్ యంత్రాల సహాయంతోనే విత్తనాలను విక్రయించి పూర్తి సమాచారాన్ని రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. రైతులకు నకిలీ విత్తనాలను అంటగడితే తీసుకుని లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విక్రయించాలని ఆదేశించారు. సమావేశంలో ఏఈఓ శ్రీయ, ఏఈఓలు పాల్గొన్నారు.



కోహెడలో విత్తనాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ అభిలాష్

ఉపాధి కూలీలకు చట్టాలపై అవగాహన

సిద్దిపేటరూరల్: మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు.. అప్రమత్తంపై మంగళవారం రూరల్‌పోలీసులు ఉపాధి కూలీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అపరిచితుల మాటలు, ఫోన్ కాల్స్‌ను నమ్మి డబ్బులు పోగొట్టుకోవద్దని సూచించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలతో అప్రమత్తంగా ఉండాలని, పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని వివరించారు. మహిళలను ఎవరైనా వేధింపులకు గురిచేసినా, అవహేళన చేస్తూ మాట్లాడినా వెంటనే 100 నంబర్‌కు కానీ, షీ టీమ్ నంబర్ 87126 67434కు కానీ ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ పరమేశ్వరి, షీ టీమ్ ఏఎస్‌ఐ కిషన్, కానిస్టేబుల్స్ మమత, లక్ష్మీనారాయణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి

హుస్నాబాద్‌రూరల్: మహిళల రక్షణకు అనేక చట్టాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని రక్షణ పొందాలని షీ టీమ్ ఏఎస్‌ఐ మణెమ్మ పిలుపునిచ్చారు. నాగారంలో ఉపాధి హామీ పనులుచేసే చోట కూలీలకు చట్టాలు, మహిళల రక్షణ గురించి వివరించారు. గ్రామాల్లో మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, వేధింపులను అరికట్టడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా షీ టీములను ఏర్పాటు చేసిందని, ఏ మైనా సమస్యలుంటే వెంటనే సమాచారం తెలియజేస్తే న్యాయం చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో షీ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.



సిద్దిపేటరూరల్: ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ పరమేశ్వరి, షీ టీమ్

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

హుస్నాబాద్/నంగునూరు(సిద్దిపేట)/కొమురవెల్లి(సిద్దిపేట): పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టిన మాజీ సర్పంచ్‌లను పోలీసులు మంగళవారం అరెస్ట్‌చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ తమ పదవీకాలం ముగిసి 18 నెలలు కావస్తున్నా గ్రామాల్లో చేపట్టిన పనులకు బిల్లులు రాలేదన్నారు. గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన సర్పంచ్‌లను ఇబ్బంది పెట్టడం సరికాదని, ప్రభుత్వం బిల్లులు చెల్లించి ఆదుకోవాలని కోరారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, విజయ, రమేశ్, సాయిలు, మల్లయ్య, సునీత, లత, భారతి, ప్రేమలత, రాజేశ్వరి, నంగునూరులో భిక్షపతి నాయక్, అయిలయ్య, స్వామిగౌడ్, రవి, కరుణాకర్, రమణారెడ్డి ఉన్నారు.



హుస్నాబాద్: అరెస్టయిన మాజీ సర్పంచ్‌లు

మందుబాబులకు జరిమాన

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో పది మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.15వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ మిల్లర్లతో కుమ్మక్కైన అధికారులు

కొమురవెల్లి(సిద్దిపేట): మిల్లర్లతో కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్న సీసీ కనకయ్య, ఏపీఎం శ్రీనివాస్ రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి తాడూరి రవీందర్ డిమాండ్ చేశారు. పార్టీ స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మర్రిముచ్చాల కొనుగోలు కేంద్రంలో 200 క్వింటాళ్ల వరకు అక్రమాలు జరిగితే కేవలం 90 క్వింటాళ్లే జరిగాయని అధికారులు చెప్పడం సిగ్గుచేటన్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని కోరారు. శారద, ఇస్తారి, భరత్, భిక్షపతి, యాదయ్య, కృపాకర్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఆడిట్ నిర్వహించాలి: సీపీఐ నేత వెంకట్‌రెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): మహిళా సంఘాల లావాదేవీలపై ఆడిట్ నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోతిరెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. బెజ్జంకిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మండల అధికారి, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రూపేష్, మధు, బాలమల్లు, శ్రవణ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

◆ డబుల్ రోడ్డు మంజూరు చేయండి

మిరుదొడ్డి(దుబ్బాక): తిమ్మాపూర్ నుంచి కొండాపూర్, అందె వరకు డబుల్ రోడ్డు మంజూరు చేయాలని కోరుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి హైదరాబాద్‌లో వినతి పత్రం అందించినట్లు కొండాపూర్ మాజీ సర్పంచ్ పెద్ది కవితారాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రోడ్డు గుంతలమయంగా మారడంతో బస్సులను కూడా నిలిపి వేశారన్నారు. వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాపోయారు. కార్యక్రమంలో శంకర్, ప్రవీణ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

◆ జీలుగ విత్తనాల పంపిణీ

మద్దూరు(హుస్నాబాద్)/చిన్నకోడూరు(సిద్దిపేట): మద్దూరు, చిన్నకోడూరులోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలలో వ్యవసాయ అధికారులు రామకృష్ణ, జయంత్ కుమార్ మంగళవారం రైతులకు సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాలలో ఏఈఓ రాజు, ఆగ్రోస్ నిర్వాహకులు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

◆ రోడ్ల మరమ్మతులకు నిధులివ్వాలి

దుబ్బాకటౌన్: రాయపోల్ మండలంలో రోడ్లు ధ్వంసమయ్యాయని వాటి మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఎంపీ రఘునందన్‌రావు నివాసంలో బీజేపీ మండల అధ్యక్షుడు మంకిడి స్వామి నాయకులతో కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేగంపేట, ఎల్కల్ గ్రామాల నుంచి మండల కేంద్రానికి వెళ్లాలంటే ఎంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌గౌడ్, రాజాగౌడ్, స్వామి, రామాంజనేయులు, అమర్, నర్సాగౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

◆ కొనుగోలు కేంద్రాల పరిశీలన

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ మల్లికార్జున్ రెడ్డి మంగళవారం సందర్శించారు. రైతులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లర్లకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు.

◆ రోడ్డు నిర్మించాలని డిమాండ్

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని గుర్జకుంట గ్రామం వరకు డబుల్ రోడ్డు వేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ డిమాండ్‌చేశారు. గుర్జకుంటలో మంగళవారం నంగి కనకయ్య అధ్యక్షతన సీపీఐ గ్రామశాఖ రెండో మహాసభ నిర్వహించారు. సభకు హాజరైన అశోక్ మాట్లాడుతూ గుర్జకుంట క్రాస్ రోడ్డు నుంచి గ్రామం వరకు ఉన్న రోడ్డు పూర్తిగా ధ్వంసమై వాహన దారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో భూమయ్య, యాదగిరి పాల్గొన్నారు.

◆ ఆర్యవైశ్యుని కుటుంబానికి ఆర్థిక సాయం

కోహెడ(హుస్నాబాద్): జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో శనిగరం గ్రామానికి చెందిన పడమటింటి లక్ష్మీనర్సయ్యకు ఇంటి స్థలం కోసం రూ.61 వేలు అందజేశామని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి గంప శ్రీనివాస్ చెప్పారు. స్థానిక వేంకటేశ్వర గార్డెన్‌లో ఆర్యవైశ్య మండల మహాసభ మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య పేదలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రత్నాకర్, రవీందర్, ఆంజనేయులు, నవీన్, కృష్ణమూర్తి, వాణి, శ్రీనివాస్, సత్యనారాయణ, అశోక్, లక్ష్మీనారాయణ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ తహసీల్దార్‌కు వినతి పత్రం

నంగునూరు(సిద్దిపేట): ధాన్యం డబ్బులు త్వరగా ఇప్పించాలని కోరుతూ మంగళవారం పలు గ్రామాల రైతులు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు తిరుపతిరెడ్డి, మల్లయ్య మాట్లాడుతూ సిద్దన్నపేట సబ్‌మార్కెట్‌లో వడ్లు అమ్మి నెల రోజులు గడిచినా డబ్బులు రావడంలేదన్నారు. ధాన్యం అమ్మిన వెంటనే ఓటీపీ అడిగారని, డబ్బులు కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోందని వాపోయారు. కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి, కనకారెడ్డి, మధు, రవి, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ బీమా చెక్కు అందజేత

సిద్దిపేటరూరల్/సిద్దిపేటకమాన్: మండలంలోని తోర్నాలకు చెందిన వల్లెపు పోచయ్య కుటుంబ సభ్యులకు మంజూరైన ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా చెక్కును యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో అందజేశారు. పోచయ్య మార్చిలో అనారోగ్యంతో మరణించగా అతడి భార్య స్వప్నకు మంగళవారం చెక్కును అందజేశారు. బ్యాంకు మేనేజర్ సురేశ్, సీఎఫ్ఎల్ రూరల్ కౌన్సిలర్లు శ్రీనివాస్, సాయికృష్ణ, రాకేశ్, రాజు, హరినాథ్, నర్సింహ పాల్గొన్నారు.